www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 22 నవంబర్ 2025
5
కాకినాడ



డిసి శ్రీనివాస్‌కు అదనపు బాధ్యతలు

ప్రజాశక్తి-కాకినాడ

కాకినాడ నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న కె.శ్రీనివాస్‌ను జివిఎస్‌డబ్ల్యుఎస్ (గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ) అదనపు కమిషనర్‌గా నియమిస్తూ రాష్ట్ర మున్సిపల్ శాఖ కమిషనర్, డైరెక్టర్ పి.సంపత్ కుమార్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. పరిపాలనలో విశేష అనుభవం ఉన్న శ్రీనివాస్‌ను ఈ కీలక పదవిలో నియమించడం ద్వారా విభాగం పనితీరులో మరింత పారదర్శకత, సమర్థత పెరుగుతుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. సేవల అందుబాటు పెంపు, ప్రజా పరిష్కార వ్యవస్థ, పరిపాలన సామర్థ్యాన్ని బలోపేతం చేయడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు శ్రీనివాస్ పేర్కొన్నారు.

చిరు వ్యాపారులకు చేయూత ఏదీ..

- గత ప్రభుత్వంలో వడ్డీ లేని రుణాలు
- వారి మాట మరిచిన కూటమి సర్కారు
- వీధి వ్యాపారుల సమస్యలు పట్టని వైనం

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

చిరు వ్యాపారులు ఎండనక, వాననక రోజంతా కష్టపడితేనే కానీ కుటుంబ పోషణ సాధ్యం కాదు. చాలామందికి ఏరోజు కారోజు కష్టించి పని చేస్తేనే పొట్ట నిండుతుంది. కుటుంబ సభ్యులను పోషించుకోవాలంటే రోడ్డుపై దుమ్ము, ధూళితోనే సహవాసం చేయాలి. ఈ నేపథ్యంలో వీధి వ్యాపారులకు ప్రభుత్వం అండగా నిలవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. గత వైసిపి ప్రభుత్వం ఆ పని కొంతమేర చేసింది. చిరు, వీధి వ్యాపారులను గుర్తించి జగనన్న తోడు పథకం అమలు చేసింది. దీని ద్వారా వ్యాపార అవసరాల కోసం సంవత్సరం రూ.10 వేల చొప్పున వడ్డీ లేని రుణాలు ఇచ్చి సాయం చేసింది. మొత్తం వీధి వ్యాపారుల్లో కొంతమేర మందికి మాత్రమే ఈ భరోసా లభించింది.

గత ప్రభుత్వ హయాంలో కోవిడ్ కారణంగా చిరు, వీధి వ్యాపారుల ఆర్థిక పరిస్థితి దయనీయంగా మారింది. దీంతో రెక్కాడితే గాని డొక్కాడని వీరిని ఆదుకునేందుకు ప్రభుత్వం జగనన్న తోడు పథకాన్ని ప్రవేశపెట్టింది. తోపుడు బళ్లు, రోడ్డ పక్కన వ్యాపారాలు చేసుకునే చిరు వ్యాపారుల్ని ఆదుకోవడం కోసం వడ్డీ లేకుండా రూ.10 వేల రుణం అందజేశారు. గుర్తించిన వారందరికీ గుర్తింపు కార్డులు జారీ చేసి వారి రికార్డులను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. గుర్తింపు కార్డులు ఉన్న వారికి రూ.10 వేల వరకు రుణాలు ఇచ్చారు. ఆయా గ్రామాలు, పట్టణాల్లో సుమారు 5 అడుగుల పొడవు, ఐదు అడుగుల వెడల్పు స్థలంలో, అంతకంటే తక్కువ స్థలంలో శాశ్వత లేక తాత్కాలిక షాపులు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు చేసుకునే వారికి, రోడ్డు పక్కన, ఫుట్‌పాత్‌ల పైన, ప్రజా, ప్రయివేట్ స్థలాల్లో తోపుడు బండ్లపై వ్యాపారాలు చేసుకుంటున్న వారు, తల మీద గంపలో వస్తువులు మోస్తూ అమ్ముకునే వారు, సైకిల్, మోటార్ సైకిల్, ఆటోలపై వెళ్లి వ్యాపారం చేసుకునే వారికి కూడా అర్హత కల్పించారు. 18 ఏళ్ళ వయస్సు నిండిన వారై ఉన్నవారికి, కుటుంబ ఆదాయం గ్రామాల్లో నెలకు రూ.10 వేల లోపు, పట్టణాల్లో రూ.12 వేల లోపు కలిగిన వాళ్లకు రుణాలు ఇచ్చారు. అప్పట్లో కాకినాడ జిల్లాలో వివిధ బ్యాంకర్లు 48,986 మందిని లబ్ధిదారులుగా గుర్తించి, రూ.48 కోట్ల 98 లక్షల 60వేల రుణాలు మంజూరు చేయాలని నిర్ణయం చేశారు. కేవలం 20 వేల మందికి మాత్రమే రుణాలు ఇవ్వగలిగారు.



కాకినాడలో బొప్పాయిలు అమ్ముతున్న వీధి వ్యాపారి

ప్రస్తుతం భరోసా కరువు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చిరు వ్యాపారులకు, వీధి వ్యాపారులకు పూర్తిగా భరోసా కరువయ్యింది. తమ ఉపాధి కోసం ఫైనాన్స్ వ్యక్తుల వద్ద అప్పులు తీసుకొచ్చి చాలామంది వ్యాపారాలు చేసుకుంటున్న పరిస్థితి ఏర్పడింది. అనేకమంది తోపుడు బళ్లతో కూరగాయలు, పళ్ల వ్యాపారాలు సాగించే వారు, బస్టాండ్ వద్ద పరుగులు పెడుతూ వివిధ రకాల తిను బండారాలు అమ్ముకునే వారు, పట్టణ, మండల కేంద్రాలు, గ్రామాల్లో వివిధ వ్యాపారాలు సాగించే వారంతా ప్రస్తుతం ఎటువంటి ప్రభుత్వ ఆసరా లేకుండా జీవనం సాగిస్తున్నారు. గత ప్రభుత్వం అమలు చేసిన విధంగా తమకు అండగా నిలిచి ఆదుకునేందుకు ఏదైనా పథకాన్ని అమలు చేసి ఆదుకోవాలని పలువురు చిరు వ్యాపారులు కోరుతున్నారు.



ప్రభుత్వం సహకారం అందించాలి

వీధి వ్యాపారులు ఎటువంటి ప్రభుత్వ సహకారం లేకుండా స్వయం ఉపాధి పొందుతూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. వీరిపైనే పలు ప్రాంతాల్లో పోలీసులు తమ ప్రతాపాన్ని చూపుతుంటారు. దీంతో వారు ఉపాధిని నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వారిని ఆదుకునేందుకు వడ్డీ లేని రుణాలు ఇవ్వాలి. గత ప్రభుత్వంలో అరకొర మందికి మాత్రమే ఇచ్చారు. కూటమి ప్రభుత్వం పూర్తిస్థాయిలో వీధి వ్యాపారులను గుర్తించి ఆదుకోవాలి.

\- సిహెచ్.రాజ్ కుమార్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి.



రోజంతా కష్టపడితేనే కుటుంబ పోషణ

ఎండనక, వాననక రోజంతా కష్టపడి పళ్ల వ్యాపారం చేస్తేనే ఆరోజు తాము కుటుంబాన్ని పోషించుకునే పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం మా వంటి వీధి వ్యాపారులకు ఏదైనా సహాయం చేస్తే బాగుంటుంది. గత ప్రభుత్వంలో వడ్డీ లేని రుణం ఇచ్చారు. కూటమి ప్రభుత్వం కూడా మా కోసం ఆలోచించాలి.

\- వాసంశెట్టి శ్రీను, వీధి వ్యాపారి, కాకినాడ

రబీలో పూర్తి ఆయకట్టుకు సాగునీరు

ప్రజాశక్తి-కాకినాడ

2025-26 రబీ పంటలకు జిల్లాలోని 1,90,865 ఎకరాల పూర్తి ఆయకట్టుకు సాగునీరు సరఫరా చేయనున్నట్టు జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి తెలిపారు. శుక్రవారం కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశం జెడ్‌పి చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, పెద్దాపురం, జగ్గంపేట, అనపర్తి, కాకినాడ రూరల్, కాకినాడ సిటీ ఎంఎల్ఎలు నిమ్మకాయల చినరాజప్ప, జ్యోతుల నెహ్రూ, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, పంతం నానాజీ, వనమాడి వెంకటేశ్వరరావు, ఎంఎల్‌సి పేరాబత్తుల రాజశేఖరం, పౌర సరఫరాల సంస్థ చైర్మన్ తోట సుధీర్, పిఠాపురం మాజీ ఎంఎల్ఎ ఎస్‌విఎస్ఎన్ వర్మ, గోదావరి ఈస్టర్న్ డెల్టా ప్రోజెక్ట్ కమిటీ చైర్మన్ ఎం.సునీల్ కుమార్, ఏలేరు ఇరిగేషన్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ బసవ వీరవెంకట నాగేంద్ర తదితర ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ఇరిగేషన్ ఎస్ఇ కె.గోపీనాథ్, గోదావరి, ఏలేరు ఇరిగేషన్ వ్యవస్థలలో ప్రస్తుతం ఉన్న నీటి నిల్వ పరిమాణాలను వివరించి, ఈ వ్యవస్థల కింద రబీ సీజనులో పూర్తి ఆయకట్టులకు సాగునీరు అందించేందుకు అవసరాల మేరకు నీటి నిల్వలు ఉన్నాయని తెలియజేశారు. కలెక్టర్ షాన్ మోహన్ మాట్లాడుతూ గోదావరి డెల్టా కింద 1,05,341 ఎకరాలు, పిఠాపురం బ్రాంచ్ కెనాల్ కింద 32,507 ఎకరాలు, ఏలేరు కింద 53,017 ఎకరాలకు, మొత్తం 1,90,865 ఎకరాల పూర్తి ఆయకట్టుకు సాగునీరు సరఫరా చేస్తామన్నారు. వచ్చే డిసెంబర్ ఒకటి నుంచి ప్రారంభమయ్యే రబీ సీజనులో ఈ ఆయకట్టుల రైతులు డిసెంబర్ 31 నాటికి నాట్లు వేసుకుని 2026 మార్చి 31లోగా పంటలను పూర్తి చేసుకోవాలని ఆయన కోరారు. రబీ పంటలకు నీటి విడుదల లోపు జిల్లాలోని సాగునీటి వ్యవస్థల పటిష్టీకరణకు ప్రతిపాదించిన పనులను పూర్తి చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ఇటీవల మొంథా తుపాను కారణంగా దెబ్బతిన్న కాలువలకు మరమ్మతులు చేపట్టి రబీ పంటలకు ఇబ్బంది లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 50 మైనర్ ఇరిగేషన్ చెరువులను ఆర్‌ఆర్‌ఆర్ (రిపేర్, రెన్నోవేషన్, రిస్టోరేషన్) స్కీమ్ కింద గుర్తించి నిధులు మంజూరు కోరుతూ ప్రతిపాదనలు పంపించామని, మరో 100 మైనర్ ఇరిగేషన్ చెరువులు కూడా గుర్తించామని వీటికి త్వరలో ప్రతిపాదన పంపిస్తామని కలెక్టర్ తెలిపారు. రబీ సీజనులో నీటి విడుదల జరిగేలోపు ఏలేరు కాలువులకు పడిన గండ్లు పనులు పూర్తి చేయడం వివిధ కెనాల్ కింద ఉన్న స్లూయిజ్ లు, గేట్లు, కాలవగట్ల రివిట్మెంట్లు, కాలువులకు పూడికతీతలు, గుర్రపు డెక్క, తూడు తొలగింపు పనులు చేపట్టి శివారు ప్రాంతాల్లో ఉన్న ఆయకట్టు భూములకు పూర్తిస్థాయిలో సాగునీరు సక్రమంగా అందించాలని ఎంఎల్ఎలు కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్ మోహన్ సగిలి

గురుకుల విద్యార్థినికి గాయాలపై విచారణ చేయాలి

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినికి తగిలిన గాయాలపై సమగ్ర విచారణ చేపట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.గంగా సూరిబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన గురుకుల పాఠశాలను సందర్శించి మీడియాతో మాట్లాడారు. 10వ తరగతి విద్యార్థిని 14వ తేదీన గాయాల పాలైంది. ఆమెను ఉపాధ్యాయులు జగ్గంపేట ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లి ప్రథమ చికిత్స చేయించి, మెరుగైన వైద్యం కోసం కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు. ఆమె మెట్లు దిగుతూ పడిపోయిందని పాఠశాల సిబ్బంది వైద్యులకు తెలిపారు. మెట్లు దిగుతూ పడితే ఇంత తీవ్ర గాయాలు అవ్వవని వైద్యులు అనడంతో విద్యార్థిని బంధువులు గురువారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో రెవిన్యూ అధికారులు, పోలీసులు పాఠశాలను సందర్శించి వివరాలు సేకరించారు. టీచర్లు, వార్డెన్ వేధింపులు తట్టుకోలేక భవనం పైనుంచి దూకి విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీటిపై సమగ్ర దర్యాప్తు చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. గురుకుల పాఠశాలను జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి తుమ్మలపల్లి రమేష్ సందర్శించారు.



గురుకుల పాఠశాలను సందర్శించిన ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రజా సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. శుక్రవారం స్థానిక వత్సవాయి భవనంలో జరిగిన నియోజకవర్గ గ్రీవెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఒకపక్క సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే కూటమి ప్రభుత్వం అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రాజా సూరిబాబు రాజు, నూనె రామారావు, పాలకుర్తి శ్రీను, రంధి సత్యనారాయణ, యాళ్ల వీరబాబు, మహమ్మద్ ఆరిఫ్ అలీ, కందుల విశ్వేశ్వరరావు, అనివిళ్ల శాస్త్రి, బడుగు శ్రీకాంత్, కాకినాడ రామారావు, తాళాబత్తుల సాయి పాల్గొన్నారు.



గ్రీవెన్స్‌లో పాల్గొన్న ఎంఎల్ఎ చినరాజప్ప



సమావేశంలో మాట్లాడుతున్న సునీల్ కుమార్

కాలుష్య నివారణకు చర్యలు

ప్రజాశక్తి-కాకినాడ


తూర్పు డెల్టా ప్రాజెక్ట్ పరిధిలోని కాలువల్లో పెరుగుతున్న కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఈస్టర్న్ డెల్టా ప్రాజెక్టు చైర్మన్ మురాలశెట్టి సునీల్ కుమార్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అధ్యక్షతన కలెక్టరేట్‌లో నిర్వహించిన ఇరిగేషన్ అడ్వైజరీ బోర్డు మీటింగ్‌లో సునీల్ కుమార్ మాట్లాడారు. పిఠాపురం నియోజవర్గంలో ఎఫ్‌డిఆర్ వర్కులు, కాకినాడ జిల్లా పరిధిలోని ఏడు లాకులు, లాక్ సూపరింటెండెంట్‌ల కార్యాలయాల పరిస్థితులు, లస్కర్ల జీతాలు, నీటి తీరువా పన్నులు, కాలువల్లో కాలుష్యం మొదలగు అంశాలపై సమావేశంలో మాట్లాడారు.

13న నవోదయ ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి-పెద్దాపురం

2026-27 విద్యా సంవత్సరంలో నవోదయలో 6వ తరగతి ప్రవేశానికి డిసెంబర్ 13న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్టు నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్ బి.సీతాలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలకు చెందిన 7170 మంది విద్యార్థులు ఈ పరీక్ష కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఈ పరీక్ష నిమిత్తం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలో 32 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. నవోదయ వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చున్నారు.

కార్టూ'నిజం'



మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని శుక్రవారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

కాకినాడ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న తోడ్పాటును మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి పేర్కొన్నారు. కాకినాడ రూరల్‌లోని ఫిషింగ్ హార్బర్‌లో జిల్లా మత్స్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, సిటీ ఎంఎల్ఎ వనమాడి కొండబాబు, ఎంఎల్‌సిలు కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖరం, రూరల్ ఎంఎల్ఎ పంతం నానాజీ హాజరై 50 వేల పండుగప్ప చేప పిల్లలను సముద్రంలోకి విడుదల చేశారు. అనంతరం నిర్వహించిన మత్స్యకార దినోత్సవ సభలో వారు మాట్లాడారు. జిల్లా మత్స్యశాఖ అధికారి వి.కృష్ణారావు, బాలసాడి రంగారావు, కె.కరుణాకర్, లావణ్య, అనురాధ, రాజేంద్రరావు, డాక్టర్ గోపి, నూకరాజు, ఉమామహేశ్వరరావు, శ్రీరామకష్ణ, మత్స్యకారులు తదితరులు పాల్గొన్నారు.



యు.కొత్తపల్లిలో చేప పిల్లలు విడుదల చేస్తున్న ఎంపీ

తాళ్లరేవు టిడిపి బిసి సెల్ అధ్యక్షుడు వాడ్రేవు వీరబాబు, మాజీ జెడ్‌పిటిసి పొన్నమండ రామలక్ష్మి, కట్టా త్రిమూర్తులు అధ్యక్షతన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి అందరికీ పంపిణీ చేశారు. కామాడి మాతరాజు, మల్లాడి వరదరాజు, వనమాడి నూకరాజు తదితరులు మాట్లాడారు. టిడిపి మండల అధ్యక్షుడు ధూళిపూడి వెంకటరమణ, డిసి చైర్మన్ వేగేశ్న భాస్కరరాజు, ఉంగరాల వెంకటేశ్వరరావు, సర్పంచ్‌ల సమాఖ్య మండల అధ్యక్షుడు టిళ్లపూడి నాగేశ్వరరావు, లంకే నూకరాజు, జక్కల ప్రసాద్ బాబు, వాసంశెట్టి శ్రీనివాస్, వెంటపల్లి ఉమామహేశ్వరి, రోళ్ల చక్రవర్తి, సంగాడి కామేశ్వరరావు, పినపోతు వీరబాబు, పెసింగి నాగబాబు, మల్లాడి ధర్మారావు పాల్గొన్నారు.



కాకినాడ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

యు.కొత్తపల్లి మత్స్యకారులు అన్ని విధాలుగా అభివద్ధి చెందాలని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ అన్నారు. అమీనాబాద్ ఫిషింగ్ హార్బర్ వద్ద మత్స్యశాఖ అధికారులు, జనసేన నాయకులతో పండుగొప్ప చేప పిల్లలను సముద్రంలోకి విడుదల చేశారు. జ్యోతుల శ్రీనివాస్, బాపన దొర, నక్క తాతారావు, రామకష్ణ పాల్గొన్నారు

పిఠాపురం మాజీ ఎంఎల్ఎ వర్మ స్థానిక టిడిపి కార్యాలయంలో కేకు కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. సూరాడ రాజు, కొర్ని రమణ, మేరుగు సూరిబాబు, రాచపల్లి సనపయ్య, కంబాల వెంకటరమణ, చోడిపల్లి ప్రసాద్, మెరుగు భూషణం, సురాడ శ్రీను పాల్గొన్నారు.

ఉత్సాహంగా రిలయన్స్ చిల్డ్రన్స్ ఫెస్ట్-2025

ప్రజాశక్తి-తాళ్లరేవు

రిలయన్స్ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో చిల్డ్రన్ ఫెస్ట్-2025 శుక్రవారం ఉత్సాహంగా ముగిసింది. గాడిమొగ పంచాయితీ లక్ష్మీపతిపురం హైస్కూల్లో పాఠశాల హెచ్ఎం. గోవిందరాజు పర్యవేక్షణలో విద్యార్థులకు ఆటల పోటీలు, సాంస్కతిక పోటీలు నిర్వహించారు. ఖోఖో బాలికల పోటీల్లో లక్ష్మీపతిపురం ప్రథమ స్థానం సాధించగా, చినవలసల ద్వితీయ స్థానంలో నిలిచింది. కబడ్డీలో బాలికల విభాగంలో భైరవ-పాలెం విన్నర్స్‌గా, గాడిమొగ రన్నర్స్‌గా నిలిచాయి. కబడ్డీ బాలుర విభాగంలో భైరవపాలెం పాఠశాల ప్రథమ స్థానం, లక్ష్మీపతిపురం ద్వితీయ స్థానం సాధించింది. వాలీబాల్ బాలుర విభాగంలో లక్ష్మీపతిపురం విన్నర్స్ స్థానం సాధించగా భైరవ-పాలెం రన్నర్ స్థానాన్ని సాధించింది. విజేతలకు రిలయన్స్ ఇండస్ట్రీస్ గాడిమొగ ప్రతినిధి సుబ్రహ్మణ్యం, స్థానిక సర్పంచ్ కామాడి గోవలక్ష్మి, ఉప సర్పంచ్ కొక్కిలిగడ్డ లోకేష్, మల్లాడి వరదరాజు, అంగాడి తాతారావు, లక్ష్మీపతిపురం గ్రామ పెద్దలు బహుమతులు అందజేశారు. ఇడిసి చైర్మన్ మల్లాడి వీరబాబు, ఉపాధ్యాయులు లక్ష్మోజీ, వెంకన్న పాల్గొన్నారు.



కబడ్డీ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

వాసవి క్లబ్ సేవలు స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి- తాళ్లరేవు

మండలంలో వాసవి క్లబ్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు మిగిలిన క్లబ్‌లకు స్ఫూర్తిదాయకంగా ఉన్నాయని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఇరుకుల రామకృష్ణ తెలిపారు. గ్రామంలో క్లబ్ చేస్తున్న కార్యక్రమాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. పేదలకు క్లబ్ చేస్తున్న సేవా కార్యక్రమాలను క్లబ్ అధ్యక్షులు కూర్మదాసు భారతి వివరించారు. వాసవి క్లబ్ కపుల్స్, యూత్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. తాళ్లరేవు శివాలయానికి వాటర్ ట్యాంక్, మానసిక వికలాంగులకు దుప్పట్లు, రత్స వారి పేటలో పాఠశాలకు మిక్సీ అందజేశారు. క్లబ్‌ల ఆధ్వర్యంలో ఉచిత సుగర్ చెకప్ క్యాంపును ఆయన ప్రారంభించారు. పలువురు పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్ గవర్నర్ మానేపల్లి బంగార్రాజు, రీజియన్ ఛైర్మన్ అద్దేపల్లి సత్తిరాజు, ఐఇసి గోకవరపు సుభాష్, స్థానిక క్లబ్ ట్రెజరర్ వరదా జయ, సామా ప్రకాష్, నున్న దత్తు, పేకేటి సతీష్, అద్దేపల్లి శ్రీను, తాతాజీ పాల్గొన్నారు.



సేవా కార్యక్రమాలు చేస్తున్న వాసవి క్లబ్ సభ్యులు



వ్యక్తిత్వ వికాసంపై ప్రసంగిస్తున్న రిసోర్స్ పర్సన్ జగన్నాథ రావు

కెరీర్‌పై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి - సామర్లకోట

పదో తరగతి తర్వాత విద్యార్థులు తమ అభిరుచులకు అనుగుణంగా కెరీర్‌పై అవగాహన పెంచుకొని, ఆ మేరకు లక్ష్యాలను నిర్దేశించుకోవాలని వ్యక్తిత్వ వికాస నిపుణులు, సెట్రాజ్ సూపరింటెండెంట్ ఎస్ఎస్ఆర్.జగన్నాథరావు అన్నారు. శుక్రవారం స్థానిక పిఎంశ్రీ మున్సిపల్ హైస్కూల్లో హెచ్ఎం తోటకూర సాయిరామ కృష్ణ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసం, కెరీర్ డెవలప్‌మెంట్‌పై శుక్రవారం అవగాహన తరగతి నిర్వహించారు. జగన్నాథరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఏదో ఒక అంశంలో అభిరుచి కలిగి ఉంటారని, దాన్ని గుర్తెరిగి క్రమశిక్షణతో పదో తరగతిలో మంచి ప్రతిభ చూపాలని సూచించారు. తల్లిదండ్రులకు, చదువుతున్న పాఠశాలకు మంచి పేరు తీసుకు రావాలని సూచించారు. సమయాన్ని వథా చేయరాదని, నేర్చుకొన్న ప్రతి అంశం భవిష్యత్‌లో ఉపయోగ పడుతుందని తెలిపారు.

హార్బర్ గట్టును మార్చాలి

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

అమీనాబాద్ శివారు రామన్నపాలెం ఉప్పుటేరు వద్ద నిర్మిస్తున్న ఫిషింగ్ హార్బర్ గట్టును మార్చాలని మత్స్యకార నాయకుడు, మండల టిడిపి అధ్యక్షుడు సూరాడ రాజు డిమాండ్ చేశారు. హార్బర్ గట్టును సక్రమంగా నిర్మించకపోవడంతో వేట ముగించుకొని తీరానికి వస్తున్న మత్స్యకారుల బోటులు గట్టును ఢీకొనడంతో బోట్లు నిత్యం ధ్వంసం కావడంతో మత్స్యకారులు నష్టపోతున్నారని ఆయన తెలిపారు. ప్రస్తుతం నిర్మించిన హార్బర్ గట్టును తొలగించి బోట్లు నిలుపుదల చేసుకునేందుకు అనుగుణంగా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



దుప్పట్లు పంచుతున్న ట్రస్ట్ సభ్యులు

వృద్ధులు, విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి- యు.కొత్తపల్లి

మంగయ్యమ్మ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వృద్ధులు, విద్యార్థులకు దుప్పట్లను పంపిణీ చేశారు. శుక్రవారం పాత ఇసుకపల్లి ఎస్‌సి పేటలో ఉన్న మండల పరిషత్ పాఠశాల విద్యార్థులకు చారిటబుల్ ట్రస్ట్ 20 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సంస్థ చైర్మన్ గొర్ల పెద్దిరాజు, సునీత దంపతులు 50 మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన విద్యార్థులను ప్రోత్సహించేందుకు వివిధ రూపంలో సాయం చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

భీమేశ్వరాలయంలో రుడా చైర్మన్ పూజలు

ప్రజాశక్తి - సామర్లకోట

భీమేశ్వర స్వామి ఆలయంలో రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి శుక్రవారం ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆయనకు ఆలయ ఇఒ బళ్ల నీలకంఠం, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కంటే జగదీశ్ మోహన్ ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన భీమేశ్వర స్వామిని, బాలా త్రిపుర సుందరి అమ్మవారలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అడబాల కుమారస్వామి, వల్లూరి శ్రీనివాస్, సిబ్బంది, ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు.

ఉద్యమ యోధుల విగ్రహాల ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఏలేశ్వరం

స్థానిక వినోద్ మిశ్రా నగర్ ఆవరణలో శుక్రవారం ప్రముఖ విప్లవ ఉద్యమ యోధులు భగత్ సింగ్, చారుమజుందార్ విగ్రహాలను సిపిఐ (ఎంఎల్) వినోద్ మిశ్రా పార్టీ కార్యదర్శి కొసిరెడ్డి గణేష్ ఆవిష్కరించారు. తొలుత ఏలేశ్వరం ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద ఉదయ్ భాస్కర్ కళాబృందం కోలాటం, నృత్యాలతో భారీ ర్యాలీగా నిర్వహించారు. అనంతరం విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కందుల ప్రసాద్, పంతం సోమరాజు, ఎలమర్తి మణి, అనకాపల్లి కుమారి, కందుల వరలక్ష్మి, సాసపల్లి సీత, చందక ఉషారాణి ఉన్నారు.

జనసేన పార్టీలో 300 మంది చేరిక

ప్రజాశక్తి-పెద్దాపురం

పెద్దాపురం మండలంలో సొసైటీ మాజీ అధ్యక్షుడు నల్లల నాగేంద్రబాబు ఆధ్వర్యంలో 300 మంది ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, డిసిసిబి చైర్మన్ తుమ్మల బాబు సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వల్లూరి జ్యోతి, ఎంపిటిసి కాదా నాగలక్ష్మి, సీనియర్ నాయకులు పల్లా శ్రీనివాస్ యాదవ్, వల్లూరి పుట్టయ్య, నల్లల వెంకన్న, వాసంశెట్టి సూర్యనారాయణ, శ్రీనివాస్, పంచాయతీ వైస్ ప్రెసిడెంట్ గుండం సత్యనారాయణ, కాదా పాపారావు, గుడాల వీరబాబు, ముప్పిడి సత్తిబాబు, మార్త నాగేశ్వరరావు, కురం దాసు లోవరాజు, పాము సత్యనారాయణ పార్టీలో చేరిన వారిలో ఉన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-దేవరపల్లి

దేవరపల్లి మండలం గౌరీపట్నం వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెదాడు. పల్లంట్ల గ్రామానికి చెందిన గొల్లపల్లి రవి గౌరీపట్నం స్టోన్ క్రషర్ వద్ద కార్మికునిగా పని చేస్తున్నాడు. శుక్రవారం ఉదయం క్రషర్ నుంచి బైకుపై వెళ్తున్నాడు. గౌరీపట్నం వద్దకు చేరుకునే సరికి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న ఐషర్ వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రవి(35) అక్కడికక్కడే మరణించాడు. ఢీ కొట్టిన తర్వాత వ్యాన్ అదుపు తప్పి బోల్తా పడింది. రవికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - తాళ్లపూడి

మండలంలోని సూరయ్యపేట, భీమోలు సరిహద్దు ప్రాంతాల్లో సారా తయారీకి నిల్వ ఉంచిన 400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామని తాళ్లపూడి ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. బెల్లపు ఊటతోపాటు సారా తయారీకి ఉపయోగించే డ్రమ్ములు గిన్నెలు కూడా ధ్వంసం చేశామన్నారు.

దింపు కార్మికుడు మృతి

ప్రజాశక్తి - కాట్రేనికోన

మండల పరిధిలోని దొంతికుర్రులో శుక్రవారం దింపు కార్మికుడు మృతి చెందాడు. దొంతి కుర్రు మెయిన్ రోడ్డు పక్కన కొబ్బరి చెట్టు ఎక్కి దింపు తీస్తుండగా మోకు అదుపుతప్పింది. చెట్టు పైనుంచి వేలాడుతుండగా మరొక దింపు కార్మికుడు చెట్టు ఎక్కే లోపు దింపు కార్మికుడు కర్రీ అప్పలరాజు కింద పడి మృతి చెందాడు. స్థానికులు 108కి సమాచారం ఇచ్చారు. 108 అక్కడికి చేరుకునే లోపు కార్మికుడు మరణించినట్లు తెలిపారు. విశాఖపట్నం నుంచి వచ్చి గత కొంతకాలంగా ఈ ప్రాంతంలో అప్పలరాజు దింపులు తీస్తుంటాడని స్థానికులు తెలిపారు. జరిగిన సంఘటనపై బంధువులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

దొంగిలించిన ఆవుదూడ లభ్యం

ప్రజాశక్తి - ఆలమూరు

చొప్పెల్ల గ్రామంలో బుధవారం అర్ధరాత్రి ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు అపహరించిన పుంగనూరు ఆవు దూడ ఆచూకీ లభ్యమైంది. పినపళ్ల గ్రామానికి చెందిన ఎంపిటిసి సభ్యుడు పెద్దిరెడ్డి పట్టాభిరామన్న రూ.2.50 లక్షల విలువైన తన 15 రోజుల పుంగనూరు ఆవు దూడను ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారని స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన విషయం విదితమే. దీనిపై ఎస్ఐ జి.నరేష్ ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకొని పరిసర ప్రాంతాల్లోని సిసి కెమెరాలను పరిశీలించారు. అయితే గుర్తు తెలియని దుండంగులు గురువారం అర్ధరాత్రి ఆవు దూడను పశువులపాక వద్ద విడిచిపెట్టి వెళ్లిపోయారు. పరిసర ప్రాంతాల్లో సంచరిస్తున్న ఆవు దూడను గమనించిన పశువుల రైతు పట్టాభి దూడను తల్లి చెంతకు చేర్చారు.

ట్రైనింగ్ సర్టిఫికెట్స్ అందజేత

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ప్రపంచ మత్స్య దినోత్సవం సందర్భంగా ఆర్ట్స్ కళాశాల జంతు శాస్త్రం విభాగానికి చెందిన 29 మంది విద్యార్థులకు కలెక్టర్ కీర్తి చేకూరి ట్రైనింగ్ సర్టిఫికెట్స్ అందచేశారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎంఎల్ఎ బుచ్చయ్య చౌదరి, ఆర్‌డిఒ కృష్ణనాయక్, ఫిషరీస్ జెడి, ఆర్ట్స్ కళాశాల జంతు శాస్త్ర విభాగం అధిపతి కె.దుర్గారావు పాలుగోన్నారు.

చెరువు అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - బిక్కవోలు

రంగాపురంలో కుడుముల చెరువు అభివృద్ధి పనులను అనపర్తి ఎంఎల్ఎ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువు అభివృద్ధి ద్వారా ఆయకట్టు కూడా పెరుగుతుందన్నారు. గ్రామాభివృద్ధితో పాటూ పర్యావరణ పరిరక్షణ కూడా చాలా ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో రంగాపురం గ్రామ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న కుందుల

'కుందుల'కు అవార్డు

ప్రజాశక్తి - పెరవలి

మండలంలో తీపర్రు గ్రామానికి చెందిన ఆక్వా రైతు, టిడిపి సీనియర్ నాయకులు కుందుల వీర వెంకట సత్యనారాయణకు ఆక్వా జిల్లా ఉత్తమ రైతు అవార్డును అందుకున్నారు. ప్రపంచ మత్స్య దినోత్సవం సందర్భంగా ంఎల్ఎ బుచ్చియ్యచౌదరి, మత్స్య శాఖ జెడి నిర్మల కుమారి చేతుల మీదుగా ఈ వార్డును ఆయన అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ఆయనకు అభినందనలు తెలిపారు

పిఎంఎఫ్ఎంఇపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి- గోకవరం

గోకవరం మహిళా సమాఖ్య కార్యాలయంలో ప్రధాన మంత్రి సూక్ష్మ ఆహార క్రమబద్ధీకరణ పథకంపై రిసోర్స్ పర్సన్స్‌కు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి జిల్లా రిసోర్స్ పర్సన్ పి.అమిలాసుఖాంత్ పాల్గొని ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార క్రమ బద్ధీకరణ పథకంపై అవగాహన కల్పించారు. ఫుడ్ ప్రాసెసింగ్ చేసుకునే వారికి 30 శాతం సబ్సిడీపై రుణాలు, యంత్రాల ఉపయోగం, ప్రాసెసింగ్, ఎంఎస్ఎంఇ సర్టిఫికెట్లు, టెక్నికల్ గైడ్‌లెన్స్ వంటివాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం జయంతి రాజు, రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు.



పోలీసులు సిబ్బందితో మాట్లాడుతన్న ఎస్పి బిందుమాధవ్

పోలీస్ స్టేషన్‌లో ఎస్పి తనిఖీలు

ప్రజాశక్తి-కాకినాడ

కాకినాడ ఒకటో పట్టణ లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పి బిందు మాధవ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ సిఐ నాగ దుర్గారావుతో రెసెప్షన్ సెంటర్‌ను పరిశీలించి ఫిర్యాదుల నిర్వహణను పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదునూ నమోదు చేయాలని ఫిర్యాదుదారులతో గౌరవంగా నడుచుకోవాలని సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిసరాలను స్టేషన్ నిర్వహణ, వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలు, ఇతర సామాగ్రి పరిశీలించారు.

నేడు బుచ్చి సీతయ్యమ్మ 190వ వర్ధంతి

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మహారాణి, 1828లో అన్నదాన సత్రం నిర్మించిన రాజా వత్సవాయి బుచ్చి సీతయ్యమ్మ 190వ వర్ధంతి సందర్భంగా పేదలకు అన్నదానం, వస్త్రదానం చేయనున్నట్టు సత్రం ఇఒ కాట్నం జగన్మోహన్ శ్రీనివాస్ తెలిపారు. మహారాణి సత్రంలో జరిగే ఈ వర్ధంతి సభలో ముఖ్య అతిథులుగా ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్, రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు, డిసిసిబి చైర్మన్ తుమ్మల బాబు పాల్గొంటారన్నారు.

సమస్యలు పరిష్కరించేందుకు ముందుంటా

ప్రజాశక్తి - జగ్గంపేట

ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు తాను ఎప్పుడు ముందుంటానని ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ ప్రజాదర్బార్‌లో నియోజకవర్గ ప్రజలు అందించిన 20 వినతులను ఆయన స్వీకరించి ఆయా శాఖల అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ అడపా భరత్, టిడిపి నాయకులు ఎస్‌విఎస్ అప్పలరాజు, జీను మణిబాబు, కన్నబాబు, జనపరెడ్డి బాబు, బుర్రి సత్తిబాబు, నీలం శ్రీను, సుంకవిల్లి రాజు, పాండ్రంకి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

మహిళా రైతు సంఘాల లీడర్ల శిక్షణ

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయం వద్ద శుక్రవారం మహిళా రైతు సంఘాల లీడర్లకు శిక్షణ ఇచ్చారు. ఎఫ్‌పిఒ బోర్డు అఫ్ డైరెక్టర్స్ ఎంపిక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిఆర్‌డిఎ పీడీ జి.శ్రీనివాస్ మాట్లాడుతూ బోర్డు డైరెక్టర్లు అనుసరించాల్సిన విధి విధానాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా డిపిఎంలు బాబూరావు, కేశవ, రాయ్, భరత్, ఎపిఎంలు అనిల్, ఉమా మహేశ్వరరావు, మహిళలు పాల్గొన్నారు.

ఆలయాల వద్ద ఘనంగా అన్నదానాలు

ప్రజాశక్తి - పెద్దాపురం

కార్తీక మాసం ముగింపు సందర్భంగా పెద్దాపురం పట్టణ పరిధిలోని, మండల పరిధిలోని పలు గ్రామాల్లో పలు ఆలయాల వద్ద శుక్రవారం ఘనంగా అన్నదానాలు నిర్వహించారు. స్థానిక శివాలయం వద్ద భారీ స్థాయిలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాలలో పలు పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

వికలాంగుల్లో ఆత్మస్థయిర్యం పెంచాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

వికలాంగుల్లో ఆత్మస్థయిర్యాన్ని పెంచాలని డాక్టర్ ఎన్.సురేష్ అన్నారు. శుక్రవారం స్థానిక జవహర్ నవోదయ విద్యాలయలో చిల్డ్రన్స్ విత్ స్పెషల్ నీడ్స్ మోటివేషన్ అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. వికలాంగుల్లో ఏ విధమైన నిరాశకు తావు లేకుండా బాలలను ప్రోత్సహించాలన్నారు. ప్రిన్సిపల్ బి.సీతాలక్ష్మి మాట్లాడుతూ 22 మంది వికలాంగ బాల బాలికలు పాల్గొన్న ఈ కార్యక్రమం ఎంతో చక్కగా నిర్వహిస్తున్నామన్నారు. స్టాఫ్ నర్స్ బాయమ్మ, ఎస్‌యుపిడబ్ల్యు టీచర్ హేమలత, లైబ్రరీ మేడం రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

చట్టబద్ధంగా దత్తత తీసుకోవాలి

ప్రజాశక్తి-ఏలేశ్వరం

పిల్లలు లేని తల్లిదండ్రులు బిడ్డలను చట్టబద్ధంగా దత్తత తీసుకొవాలని ఎంపిపి గొల్లపల్లి బుజ్జి అన్నారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఐసిడిఎస్ నిర్వహించిన దత్తత అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. దత్తత సమయంలో తల్లిదండ్రులు దళారులను నమ్మి మోసపోకుండా చట్టబద్ధంగా వ్యవహరించాలన్నారు. ఇటీవల మోసగాళ్లు పిల్లలు లేని తల్లిదండ్రుల బాధలను ఆసరాగా తీసుకుని అనేక మోసాలకు పాల్పడుతున్నారని ఎంపిడిఒ సిహెచ్.రవికుమార్ వర్మ అన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఒ పద్మావతి, ఏలేశ్వరం వైస్ ఎంపిపిలు చిక్కాల రాజ్యలక్ష్మి, షాదీ లోవరాజు పాల్గొన్నారు.



భీమేశ్వరాలయంలో పోటెత్తిన యాత్రికులు

భీమేశ్వరాలయానికి పోటెత్తిన యాత్రికులు

ప్రజాశక్తి - సామర్లకోట

కార్తీక మాస పూజల ముగింపులో భాగంగా శుక్రవారం రాత్రి వేలాదిమంది యాత్రికులతో సామర్లకోట భీమేశ్వరాలయం కిటకిటలాడింది. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయాన్ని పచ్చి పూలతో సుందరంగా అలంకరించారు. యాత్రికులు భారీ సంఖ్యలో క్యూ లైన్లలో వేచి ఉన్నారు. మధ్యాహ్నం 2 గంటలకే భక్తులు బారులు తీరి నిలబడగా, సాయంత్రం 4 గంటలకు యాత్రికులను దర్శనాలకు అనుమతించారు. ప్రత్యేక ప్రసాదాల పంపిణీని ఎంఎల్ఎ చినరాజప్ప తనయుడు, రంగనాగ్ ప్రారంభించారు. డిఎస్‌పి డి.శ్రీహరి రాజు, సిఐ ఎ.కృష్ణభగవాన్ పర్యవేక్షణలో బందోబస్తు నిర్వహించారు. దొమ్మేటి శ్రీనివాస్, బడుగు శ్రీకాంత్, అడబాల కుమారస్వామి, బలుసు వాసు, వల్లూరి దొరబాబు పాల్గొన్నారు.

పంటల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి-గొల్లప్రోలు

ఈ నెల 25న అల్పపీడనం కారణంగా వర్షాలు పడే అవకాశం ఉండడంతో రైతులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని తహశీల్దారు రామ్ కుమార్, ఎఒ కెవివి.సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం స్థానిక తహశీల్దారు కార్యాలయంలో అల్పపీడనం కారణంగా రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమీక్షించారు. రైతులు వరి పంటకోతకు వచ్చిన వాటిని వాయిదా వేసుకోవాలని, వరి కుప్పలపై బరకాలు వేసుకుని నీరు దిగకుండా జాగ్రత్త తీసుకోవాలని సూచించారు. నీరు చేరితే ఐదు శాతం ఉప్పు ద్రావణం పిచికారీ చేసినట్లయితే మొలకలు రాకుండా ఉంటుందని తెలిపారు.

ఎంఎల్ఎ దాట్లను విమర్శించడం తగదు

ప్రజాశక్తి-తాళ్లరేవు

గతంలో చమురు కంపెనీల నుంచి 13 నెలలకు పరిహారం ఇవ్వాలని అగ్రిమెంట్ ఉన్నా 6 నెలలకు మాత్రమే పరిహారం తీసుకొచ్చి మత్స్యకారులను మోసం చేసిన మాజీ ఎంఎల్ఎ పొన్నాడ సతీష్ కుమార్‌కు ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజును విమర్శించే అర్హత లేదని టిడిపి నాయకులు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో బోటు ఓనర్స్ అసోసియేషన్ నాయకులు కామాడి మాతరాజు, వాడ్రేవు వీరబాబు మాట్లాడారు. ఇటీవల గాడిమొగ పంచాయతీ చినవలసలలో జరిగిన సభలో కంపెనీల పరిహారంపై పొన్నాడ సతీష్ చేసిన వ్యాఖ్యలను వారు తీవ్రంగా ఖండించారు. కొన్ని కారణాలవల్ల నిలిచిపోయిన పరిహారాన్ని చిత్తశుద్ధితో కృషి చేసి పరిహారం తీసుకొచ్చిన ఘనత ఎంఎల్ఎ దాట్లకు దక్కుతుందన్నారు. లంకే నూకరాజు, పొన్నమండ రామలక్ష్మి, సంగాడి కామేశ్వరరావు, కొప్పాడి ధర్మారావు, పెసింగి నాగబాబు, పినపోతు వీరబాబు, మల్లాడి ఈశ్వరరావు, సంగాడి గోవరాజు, మల్లాడి శివ పాల్గొన్నారు.



గండేపల్లిలో పారిధ్య పనులు చేస్తున్న కార్మికులు

పలుచోట్ల స్పెషల్ శానిటేషన్ డ్రైవ్

ప్రజాశక్తి-యంత్రాంగం

గొల్లప్రోలు పట్టణంలోని నగర పంచాయతీ ఆఫీస్ నుంచి మెయిన్ రోడ్ మీద బల్లకట్టు వరకూ శుక్రవారం స్పెషల్ శానిటేషన్ పనులు చేపట్టారు. రోడ్డుకిరువైపులా పెరిగిపోయిన పిచ్చి మొక్కలను తొలగించి రోడ్లు డ్రైనేజీల్లో మురికి తొలగించి ట్రాక్టర్ల ద్వారా తరలించారు. ఈ డ్రైవ్‌లో కమిషనర్ పి.శ్రీనివాస్, కె.రఘు ప్రసాద్ పాల్గొన్నారు.

తాళ్లరేవు పంచాయతీ పరిధిలోని అన్ని గ్రామాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించడంతోపాటు, కోరంగి పంచాయతీ పరిధిలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ సర్పంచ్ పెయ్యల మంగేష్, కార్యదర్శి విజెవి.రమణ పాల్గొన్నారు.

కరపలో ఎంపిడిఒ జి.శ్రీనివాసరావు, డిప్యూటీ ఎంపిడిఒ డి.శ్రీనివాసరావు ఆధ్వర్యాన శానిటేషన్ పనులు చేశారు. కార్యదర్శులు నిర్మల కుమారి పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

గండేపల్లిలో శుభ్రత పరిశుభ్రతపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించినట్లు ఎంపిడిఒ కర్రి హరికృష్ణ సత్యారెడ్డి తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలో 18 గ్రామ పంచాయతీలకు గాను ఒకో గ్రామంలో పారిశుధ్యంపై దృష్టి పెట్టి పూర్తిస్థాయిలో శుభ్రం చేసి డ్రైనేజీలు సక్రంగా వెళ్లే విధంగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు ఫణీంద్ర కుమార్, తరంగిణి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

23న స్కాలర్‌షిప్ పరీక్ష

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం పరిసర ప్రాంతాల్లో విద్యార్థుల స్కాలర్‌షిప్‌లకు సంబంధించి ఈ నెల 23న పరీక్ష నిర్వహిస్తామని శ్రీప్రకాష్ సినర్జీ స్కూల్ డైరెక్టర్ సిహెచ్.విజయప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. 5, 6, 7, 8, 10 తరగతుల విద్యార్థులు ఈ పరీక్ష రాయడానికి అర్హులన్నారు. శ్రీప్రకాష్ సినర్జీ స్కూల్లో ఈ నెల 23వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకూ, మధ్యాహ్నం 2:00 గంటల నుంచి 4:00 గంటల సమయంలో ఈ పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఈ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా నూరు శాతం వరకూ ఫీజు రాయితీ ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 9247739333 నెంబరులో సంప్రదించవచ్చన్నారు.

లేబర్ కోడ్ ప్రతుల దహనం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా సిఐటియు ఆధ్వర్యంలో హర్లిక్స్ ఫ్యాక్టరీ వద్ద లేబర్ కోడ్ నోటిపై పత్రాలను శుక్రవారం దహనం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కర్రి రామకృష్ణ పాల్గొని మాట్లాడారు. ఆరేళ్లుగా లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా కార్మికులు పోరాడుతున్నారన్నారు. వారి ఆందోళనలను సైతం పరిగణలోకి తీసుకోకుండా లేబర్ కోడ్‌లను నోటిపై చేయడం దారుణమన్నారు. వీటిని రద్దు చేసే వరకు పెద్ద ఎత్తున ప్రతి కార్మికుడు నిరసన కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. పని ప్రదేశాల్లో బ్లాక్ బ్యాడ్జీలు ధరించి నిరసన తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో కె.రంగారావు, సిహెచ్.రామకృష్ణ, ఎస్.దుర్గాప్రసాద్, మారుతి, ముత్యాలరావు, గంగరాజు, జెపి తదితరులు పాల్గొన్నారు

22న జిల్లా వ్యాప్తంగా ఉపాధి గ్రామసభలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఈ నెల 22న ఉపాధి హామీపై గ్రామ సభలు నిర్వహించాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం.నాగమహేశ్వరరావు శుక్రవారం సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు పారదర్శకతను చేరువ చేయడం, సేవలను గ్రామ స్థాయిలోనే అందుబాటులోకి తేవడం ఈ గ్రామ సభల ప్రధాన ఉద్దేశ్యమన్నారు. పంచాయతీరాజ్, గ్రామీణ అభివద్ధి శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించిన సేవలను ప్రజల ముందుకు తీసుకువచ్చేందుకు ఈ గ్రామ సభలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ గ్రామ సభల్లో కొత్త జాబ్ కార్డు దరఖాస్తులను స్వీకరించి మంజూరు చేయాలన్నారు. ఇకెవైసి సమస్యల కారణంగా రద్దు అయిన, లేదా తొలగించిన జాబ్ కార్డులను మళ్లీ పరిశీలించి అర్హులైన వారికి పునరుద్ధరణ చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఉపాధి కార్మికులు, గ్రామస్తులు ఈ సభల్లో పాల్గొని సమస్యలను నేరుగా తెలియజేయాలని సూచించారు.

కొనుగోలు కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి-నల్లజర్ల

నల్లజర్ల మండలంలో 14 రైతు సేవా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను వ్యవసాయ శాఖ అధికారి బి.సోమశేఖర్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 613 మంది రైతుల నుంచి ఇప్పటి వరకూ 682 టన్నులు ధాన్యాన్ని సేకరించామని తెలిపారు. వీటి విలువ రూ.14.45 కోట్లు ఉంటుందన్నారు. ధాన్యం డబ్బులు నేరుగా రైతుల బ్యాంకు ఖాతాలకు జమ అవుతాయన్నారు. ఆయన వెంట వ్యవసాయ శాఖ అధికారి బి.సోమశేఖర్, సిబ్బంది ఉన్నారు.

ఆర్‌టిసికి రూ.32 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

కార్తీక మాసంలో ప్రత్యేక సర్వీసులు నడపడం వల్ల ఆర్‌టిసికి రూ.32 లక్షల ఆదాయం సమకూరిందని జిల్లా ప్రజా రవాణా అధికారి వైఎస్ఎన్.మూర్తి తెలిపారు. కార్తీక మాసంలో శబరిమలకు 8 బస్సులు, పంచారామాలకు 13 బస్సులు, ఏకాదశి రుద్రులు, నవ నందులు, శివ కేశవ దర్శిని, కోనసీమ స్పెషల్స్‌గా 15 బస్సులు, మొత్తంగా 36 బస్సులు 50 వేల కిలోమీటర్లు మేర నడిపామన్నారు. వీటి ద్వారా సుమారుగా రూ.32 లక్షల ఆదాయం వచ్చినది. అయ్యప్ప భక్తులు నాలుగు డిపోల నుంచి మరికొన్ని శబరిమల యాత్ర బస్సులు బుక్ చేసుకున్నారన్నారు. ధనుర్మాసంలో ప్రత్యేక యాత్రా బస్సులు నడిపేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు.

సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - కొవ్వూరు

కొవ్వూరులోని టిడిపి కార్యాలయంలో శుక్రవారం సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎంఎల్‌సి ముప్పిడి వెంకటేశ్వరరావు లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు అందజేశారు. నియోజకవర్గంలో నలుగురు లబ్ధిదారులకు వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైన రూ.3,11,271 విలువ గల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణ, జొన్నలగడ్డ సుబ్బరాయుడు చౌదరి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

గుడ్ టచ్-బ్యాడ్ టచ్‌పై అవగాహన

ప్రజాశక్తి - పెరవలి

మండలంలోని కానూరు, కాకరపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గుడ్‌టచ్-బ్యాడ్ టచ్‌లపై బాలికలకు అవగాహనా కార్యక్రమాలను నిర్వహించారు. కొవ్వూరు డిఎస్‌పి జి.దేవకుమార్ ఆదేశాల మేరకు ఎస్ఐ ఎం.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో శక్తి టీమ్ పాఠశాలలను సందర్శించి సమావేశం నిర్వహించారు. పిఒ సిఎస్ఒ చట్టాలు, 112 కాల్స్, శక్తి యాప్, సైబర్ మోసాలు, ఇతర నేరాల గురించి అవగాహన కల్పించారు ఆపద సమయంలో విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీరామచంద్రమూర్తి, ఉపాధ్యాయులు నేతల విజయకుమార్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

రుడా చైర్మన్ వెంకటరమణ చౌదరి

ప్రజాశక్తి - సీతానగరం

నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్నామని అందులో భాగంగానే ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించామని రుడా చైర్మన్, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొడ్డు వెంకటరమణచౌదరి అన్నారు. బూరుగుపూడిలోని టిడిపి కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఆయన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. నియోజకవర్గంలోని సామాన్య ప్రజలు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు సమస్యలను నేరుగా ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.

యానాం వార్తలు



వ్యాయమ ఉపాధ్యాయులతో క్రీడాకారులు

ఉత్సాహంగా అస్మిత అథ్లెటిక్స్ లీగ్

ప్రజాశక్తి - యానాం

స్థానిక జిఎంసి బాలయోగి క్రీడా ప్రాంగణంలో అస్మిత అథ్లెటిక్స్ లీగ్ -2025 పోటీలు శుక్రవారం ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిస్ట్రిక్ట్ అథ్లెటిక్ అసోసియేషన్ సెక్రటరీ చింత వెంకన్న మాట్లాడుతూ అండర్ 14, 16 బాలికల విభాగంలో వివిధ రకాల పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. సుమారు 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విద్యాశాఖ అధికారి పంపన లక్ష్మణ ప్రవీణ్ ప్రారంభించారు. ఈ పోటీలను శాయ్ స్పోర్ట్స్ ఇంచార్జ్ ఎన్.ఉదయ్ కుమార్ పర్యవేక్షించారు. అనంతరం విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం కోచ్ బోరా వెంకట్ రెడ్డి, పబ్బినీడి శేఖర్, పాము సత్యనారాయణ, సన్యాసిరావు, వరప్రసాద్, విష్ణుమూర్తి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శివం బాత్ వద్ద మహిళల దీపారాధన

ప్రజాశక్తి - యానాం

కార్తీక మాసం చివరి రోజు పురస్కరించుకొని పోలి పాడ్యమి సందర్భంగా శుక్రవారం యానాం గౌతమి గోదావరి నదీ తీరాన శివం బాత్ వద్ద మహిళలు దీపారాధనలు చేశారు. తెల్లవారుజామున నుంచే ఆలయాలు కిటకిటలాడాయి. శివలింగం వద్ద శివనామస్మరణతో స్నానాలు చేసి ఒత్తులు వెలిగించి గౌతమి గోదావరిలో విడిచిపెట్టి మంగళహారతులు ఇచ్చారు. ఉసిరి దీపాలతో దీప దానం, స్వయం పాకాలు అందజేశారు.



ఐస్ బాక్సులు పంపిణీ చేస్తున్న ఆర్ఎఒ అంకిత్ కుమార్

ఘనంగా మత్స్యకార దినోత్సవం

ప్రజాశక్తి - యానాం

ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని యానాం మత్స్యశాఖ ఆధ్వర్యంలో స్థానిక మత్స్యశాఖ కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్ డి.గొంతియ్య అధ్యక్షతన శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆర్ఎఒ అంకిత్ కుమార్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ఐస్ బాక్స్‌లు అందజేశారు. వారం రోజులుగా మత్స్యకార విద్యార్థిని విద్యార్థులు, మహిళలకు నిర్వహించిన ఆటల పోటీలలో గెలుపొందిన విజేతలకు ఆర్ఎఒ బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ సిబ్బంది. లబ్ధిదారులకు ఐస్ బాక్సులను అందజేస్తున్న ఆర్ఎఒ

మత్స్యకారుల డిమాండ్లను పరిష్కరించాలి

యానాం అగ్నికుల క్షత్రియ సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ మత్స్యకార దినోత్సవ వేడుకలు స్థానిక అగ్నికుల క్షత్రియ కళ్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మల్లాడి కృష్ణారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లాడి మాట్లాడుతూ మత్స్యకారుల డిమాండ్లపై తక్షణమే ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని లేదంటే ప్రభుత్వ కార్యక్రమాలు మత్స్యకారులు బహిష్కరించాల్సి వస్తుందన్నారు. అందుకే ప్రభుత్వం నిర్వహించిన మత్స్యకారుల దినోత్సవాన్ని బాయ్ కాట్ చేశామన్నారు. ఒఎన్‌జిసి పైప్ లైన్ లీకేజ్ నష్టానికి ప్రజలకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిఎస్‌పిసికి సంబంధించి 661 మంది లబ్ధిదారులకు, మరణించిన వారి భార్యలకు 7 నెలల పరిహారం విడుదల చేయాలన్నారు. జిఎస్‌పిసి పెండింగ్ పనుల ప్రారంభించాలన్నారు.

28న జాతీయ యువజన ఉత్సవాలు

ప్రజాశక్తి - యానాం

భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు క్రీడా మంత్రిత్వ శాఖ, నేషనల్ సర్వీస్ స్కీమ్ జాతీయ యువజన ఉత్సవాలు ఈ నెల 28న స్థానిక నేతాజీ సుభాష్ చంద్రబోస్ ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో నిర్వహించనున్నట్టు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ చింతపల్లి కృష్ణ సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. యానాంలోని 15 నుండి 29 మధ్య వయసుగల విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొనవచ్చని తెలిపారు. ఈ పోటీల్లో భాగంగా ఫోక్ డాన్స్, ఫోక్ సాంగ్, పెయింటింగ్, డిక్లరేషన్ డిబేట్ తదితర అంశాలతో కూడిన పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు డాక్టర్ శాంతారాజు (7382161278), కె.తాతారావు (9908591789), వి.ఆనంద్ (9849010936) నెంబర్లను సంప్రదించాలన్నారు.